



- ఐదేళ్లలో విపరీతంగా పెరుగుదల
- కొనాలంటేనే జంకుతున్న జనం
- పేద, మధ్యతరగతిపై మోయలేని భారం

ధరల దడ!

చుక్కల్లో నిత్యావసరాల ధరలు

బ్యాగు తీసుకుని, బజారుకెళ్తే సరుకుల ధరలు చూసి దడ పుడుతోంది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడున్న ధరలు మరో వారం ఆగి వెళ్తే ఉండవు. పెరిగిపోయి ఉంటాయి. ఉప్పు, పప్పుకాడ నుంచి బియ్యం దాకా ఇలా ప్రతీదీ సామాన్యులకు భారంగా మారింది. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుడి ఇంటి బడ్జెట్ తల్లకిందులవుతోంది. ఐదేళ్లలో సగటున 30 నుంచి 50 శాతం వరకు అన్ని నిత్యావసరాల సరుకుల ధరలు పెరిగాయి. వీటికి తోడు వంట గ్యాస్, పాలు, విద్యుత్ బిల్లుల బాదుడుతో ఇంటి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. నిత్యావసర వస్తువులు, సరుకుల, కూరగాయల రూపంలోనే నెలకు రూ.3వేలదాకా అదనంగా భారం పడిందని మధ్యతరగతి వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో సరుకులు సక్రమంగా ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యులు సంపాదించిన సొమ్ములో సింహభాగం నిత్యావసర సరుకులకే ఖర్చు చేయాల్సి వస్తోంది. ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలపై పెను భారం పడుతోంది. రోజురోజుకీ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి పడ్డట్లు అవుతున్నా.. ప్రభుత్వం కనీస ఉపశమన చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



ఎడాపెడా పెరుగుదల

నిత్యావసర సరుకులు, కాయగూరల ధరలు ఎడాపెడా పెరిగిపోయాయి. దీంతో మార్కెట్‌కు వెళ్లాలంటే గుండె గుబేల్‌మనే పరిస్థితి నెలకొంది. ఐదేళ్లగా కాయగూరలు, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకీ పైపైకి ఎగబాకుతున్నాయి. చివరకు కట్ట ఆకుకూర సైతం రూ.20 ధర పలుకుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధరలను చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువులు, కూరగాయల కొనుగోలును తగ్గిస్తున్నారు. కిలో కొనే వారు పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. వెరసి నీళ్లచారుతో కడుపు నింపుకుంటున్నారు. సామాన్యులకు కూలి ధరలు పెరగలేదు కానీ, నిత్యావసర వస్తువులు, కాయగూరల ధరలు మాత్రం పెరిగి భారంగా మారాయి. కాయకష్టం చేసి సంపాదించిన సొమ్ములో వారానికి వచ్చే సరికి సగం నిత్యావసర సరుకులకే ఖర్చు చేస్తున్నారు. ఈ ధరల పోటు ఇంకెన్నాళ్లని సామాన్య ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ధరల పెరుగుదలతో ఇటీవల మార్కెట్‌లో కొనుగోళ్లు సైతం తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు.

ఐదేళ్లలో నిత్యావసరాల ధరల పెరుగుదల ఇలా..

(కిలోకి రూ.ల్లో.. నూనెలు లీటర్లలో..)

నిత్యావసర సరుకులు	2019	2024
బియ్యం సోనా	42	60
వేరుశనగ	70	130
కంది పప్పు	80	170
పెసర పప్పు	75	130
వేరుశనగ నూనె	110	175
సన్‌ఫ్లవర్ నూనె	83	115
పామాయిల్	65	107
చక్కెర	38	43
బెల్లం	45	65
రాగులు	30	42
శనగపప్పు	65	82

బియ్యం కొనలేం..



బియ్యం ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. 2022 సెప్టెంబరు నుంచి పెరుగుదల మొదలై ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. కిలో సన్న బియ్యం రూ.55 ఉండగా గరిష్ఠంగా ప్రస్తుతం రూ.75 దాటింది. సగటున నెలకు చిన్న కుటుంబం 25 కిలోలు వినియోగిస్తుందనుకుంటే నెలకు ఆ కుటుంబంపై బియ్యం రూపంలోనే రూ.500దాకా అదనపు భారం పడుతోంది. అన్ని రకాల కిలో సన్న బియ్యం రూ.50పైనే ధరలు పలుకుతున్నాయి. బియ్యం ధరలు రోజురోజుకీ పెరుగుతుండడంతో మార్కెట్‌లో కొనలేం అంటూ మధ్యతరగతి కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.

నియంత్రణ ఏదీ?

బియ్యం, పప్పు, నూనె, ఉల్లిపాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అయినా, వాటిపై నియంత్రణ కరువైంది. పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారు. ధరల నియంత్రణ దిశగా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

సగం సంపాదన తిండికే..



నేను తాపీ కార్మికుడిని. రోజంతా కష్టపడితే రూ.700 వస్తుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సంపాదించిన దానిలో సగం తిండికే ఖర్చవుతోంది. మిగిలిన దాంట్లో ఇతర అవసరాలకు సర్దుకుపోవాల్సి వస్తోంది. అనూహ్య ఖర్చులు వస్తే అంతే సంగతులు. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువులు, పెళ్లిళ్ల గురించి ఆలోచిస్తేనే భయమేస్తుంది.

- శివ, శ్రీకంఠపురం, హిందూపురం

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 28.0	40.0 28.0	41.0 28.0	41.0 28.0	38.0 27.0



పువ్వులు దొరకలేదా.. జగన్..!

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయమెన్నడు?

- వారంలోపే న్యాయం చేస్తామని హామీ
- ఐదేళ్లయినా అమలు చేయని వైనం
- మండిపడుతున్న బాధితులు



2

అమ్మ జగనా..!



అగ్రిగోల్డ్ బాధితుల బాధలు విన్నా. వారి కష్టాన్ని ప్రత్యక్షంగా చూశా. అధికారంలోకి వచ్చిన వారంలోపే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం. చనిపోయిన వారి కుటుంబాలకు చంద్రబాబు ఇస్తున్న పరిహారానికి అదనంగా రూ.ఏడు లక్షలు పువ్వుల్లో పెట్టి ఇస్తాం.

..ఇవీ గత ఎన్నికలకు ముందు పాదయాత్రలో వైసీపీ అధినేత జగన్ కుమ్మరించిన హామీలు. పలికిన ప్రగల్భాలు. ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం కూడా అయ్యారు. వారం గడిచింది, ఏడాది దాటింది, చివరకు మళ్లీ ఎన్నికలే వచ్చినా.. అగ్రిగోల్డ్ బాధితులకు మాత్రం న్యాయం చేకూరలేదు. అదుగో.. ఇదుగో.. అంటూనే ఐదేళ్లు గడిపేశారు. తొలుత రూ. పదివేలలోపు డిపాజిట్లు చెల్లిస్తామన్నారు. ఆ తరువాత రూ.20వేల బాండ్లకు సొమ్ము ఇస్తామన్నారు. అతి త్వరలో మిగిలిన వారికీ చెల్లిస్తామన్నారు. నేటికీ అతీగతీలేదు.

కదిరిఅర్బన్, ఏప్రిల్ 18: అగ్రిగోల్డ్ సంస్థ మోసం కారణంగా వేల సంఖ్యలో ఖాతాదారులు, ఏజెంట్లు సర్వం కోల్పోయారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. భవిష్యత్తు అవసరాలు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం సొమ్మును అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్ చేశారు. ఆ సంస్థ మోసం చేయడంతో ఖాతాదారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కొంతమంది ఆత్మహత్య చేసుకోగా, మరికొంతమంది ఆవేదనతో ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు వందలమందికిపైగా చనిపోయారని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంఘం నాయకులు చెబుతున్నారు. ప్రాణాలు కోల్పోయిన వారికిరూ.10లక్షల చొప్పున పరిహారం ఇస్తామని 2017 మార్చి 24న విజయవాడలోని బాధితుల దీక్షాశిబిరంలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరిచారు. బాధితులను ఆదుకున్న పాపానపోలేదు. అగ్రిగోల్డ్ ఆస్తులు వైసీపీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. వాటిని వేలం వేసి, బాధితులకు ఎందుకు న్యాయం చేయలేకపోయారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో తమపై కురిపించిన ప్రేమ, సానుభూతి ఇప్పుడేమయ్యాయని బాధితులు ఆవేదన చెందుతున్నారు. అంతా ఓట్ల నాటకం అంటూ మండిపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1.15 లక్షల మంది..

అగ్రిగోల్డ్ సంస్థలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1.15 లక్షల మందికి పైగా డిపాజిట్‌దారులున్నారు. విడతలవారీగా నగదు డిపాజిట్ చేస్తూ వచ్చారు. ఒక్కొక్కరు రెండు అంతకంటే ఎక్కువ బాండ్లు తీసుకుని, నెల వారీ డబ్బులు కట్టారు. తాము డిపాజిట్లు కట్టడమే కాకుండా అందులో వందల మంది ఏజెంట్లుగా చేరారు. వేల సంఖ్యలో ఖాతాదారులను చేర్పించి, డిపాజిట్లు చేయించారు సంస్థ ఒక్కసారిగా బోర్డు తిప్పేయడంతో వీరంతా రోడ్డున పడ్డారు. డిపాజిటర్ల ఒత్తిడి భరించలేక పలువురు ఏజెంట్లు ఆత్మహత్య చేసుకున్నారు.

రోడ్డున పడ్డా



అగ్రిగోల్డ్ సంస్థను నమ్మి, అందులో ఏజెంట్‌గా చేరి, బంధువులు, స్నేహితుల ద్వారా రూ.22లక్షల వరకు డిపాజిట్లు కట్టించా. సంస్థ బోర్డు తిప్పేయడంతో డిపాజిట్‌దారుల నుంచి ఒత్తిడి ఎక్కువైంది. దీంతో ఉన్న ఇల్లు అమ్మి రూ.4 లక్షల వరకు వారికి చెల్లించా. మిగిలిన సొమ్ము కోసం డిపాజిట్ చేసినవారు ఒత్తిడి తెస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక తీవ్ర మనోవేదనకు లోనవుతున్నా. ఉన్న ఊరు వదిలి, పట్టణానికి వలస వచ్చి, ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

- ఉత్తన్న, ఏజెంటు, కదిరి

భర్తను పోగొట్టుకున్నా



మాది ఓడీసీ మండలంలోని కుసుమవారిపల్లి. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారం. అగ్రిగోల్డ్‌లో సొంత డబ్బు పెట్టడమే కాకుండా ఏజెంటుగా చేసి, తెలిసినవారి ద్వారా దాదాపు రూ.12లక్షలు డిపాజిట్లు కట్టించాం. సంస్థ బోర్డు తిప్పేయడంతో డిపాజిట్‌దారుల నుంచి ఒత్తిడి ఎక్కువైంది. ఈ వేదనతో నా భర్త కుల శేఖర్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉన్న రెండెకరాల భూమిని అమ్మి కొద్దిగా అప్పు తీర్చాం. మిగిలిన డబ్బు కోసం ప్రజల నుంచి ఒత్తిడి అధికమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

- మంజుల, బాధితురాలు

మాగోడు వినిపించుకోరా..



వేలమంది నుంచి డిపాజిట్లు సేకరించిన అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పేయడంతో చాలామంది రోడ్డున పడ్డారు. అరకొర సంపాదనలో భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్ము రాకపోవడంతో ఆత్మహత్యలు చేసుకున్నారు. మా కుటుంబ సభ్యులందరూ కలిసి రూ.20లక్షల దాకా డిపాజిట్లు చేశాం. ప్రభుత్వం నుంచి సాయం అందుతుందన్న ఆశతో వారు అడిగిన పత్రాలన్నీ ఇచ్చాం. ఖాతాలో రూపాయి కూడా జమకాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

- అత్తార్ మహబూబ్ బాషా, అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమ సంఘం నేత, కదిరి

ముఖ్యమంత్రికి పువ్వులు దొరకడం లేదేమో..!



అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాననీ, వారికి రావలసిన సొమ్ము పువ్వుల్లో పెట్టి ఇస్తానని 2017లో ప్రతిపక్షనేతగా జగన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు కావస్తున్నా, ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. బాధితులకు పరిహారం పువ్వుల్లో పెట్టి ఇస్తామన్న ముఖ్యమంత్రికి పువ్వులు దొరకడం లేదేమో. డిపాజిట్లు చేయించిన ఏజెంట్లు వారి ఒత్తిడి భరించలేక పక్క రాష్ట్రాలు, పక్క జిల్లాలకు వలస వెళ్లారు.

- నారాయణప్ప, సంఘం జిల్లా అధ్యక్షుడు, కదిరి

అసమర్థ ప్రభుత్వం

పదిశాతం హంద్రీనీవా పనులు పూర్తి చేయలేని జగన్

- ఐదేళ్లూ ప్రజలను పట్టించుకోని వైనం
- ఎన్నికల వేళ సిద్ధం అంటూ హడావుడి..

వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజం



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి

మడకశిర, ఏప్రిల్ 18: హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా మిగిలిపోయిన పది శాతం పనులను కూడా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. ఇది అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేసి, చెరువులకు నీరు అందిస్తాననీ, లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తానని గొప్పలు చెప్పిన జగన్.. సీఎం సీటులో కూర్చున్నాక ప్రాజెక్టును పట్టించుకోలేదంటూ విమర్శలు గుప్పించారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తాననీ, యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. లెదర్‌పార్కు పూర్తి చేస్తాననీ, మడకశిర చుట్టూ రింగ్‌రోడ్డు వేస్తామన్న హామీలు ఏమయ్యాయని మండిపడ్డారు. ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర రాజధాని ఏదైనా సాధించగలిగారా అంటూ ప్రశ్నించారు. ఐదేళ్లలో సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చింది లేదన్నారు. ఎన్నికల వేళ సిద్ధం అంటూ హడావుడి చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో డబ్బు పంచడానికి వైసీపీ నాయకులు సిద్ధమయ్యారనీ, ఏమేరకు పంచుతారని సభకు హాజరైన వారిని ఆమె అడగ్గా.. రూ.5వేలు అంటూ వారు తెలిపారు. డబ్బు తీసుకున్నా.. ఓటు మాత్రం ప్రజల అభివృద్ధికి పాటుపడే పార్టీకి వేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేటీ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు.

కోలాహలం

- తొలిరోజు మొత్తం నామినేషన్లు - 6
- ఎంపీ స్థానానికి - 1
- ఎమ్మెల్యే స్థానానికి - 5

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఘట్టానికి గురువారం తెరలేచింది. తొలిరోజు జిల్లాలో ఈ ఘట్టం కోలాహలంగా సాగింది. పుట్టపర్తి అసెంబ్లీ స్థానానికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పల్లె సింధూరారెడ్డి, పల్లె వెంకటక్రిష్ణకిశోర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నామినేషన్ వేశారు. హిందూపురం అసెంబ్లీ స్థానానికి బీఎస్పీ తరపున శ్రీరాములు, ధర్మవరంలో వైసీపీ తరపున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో హిందూపురం ఎంపీ స్థానానికి వైసీపీ అభ్యర్థి శాంత తరపున ఆమె ఏజెంటు నామినేషన్ సమర్పించారు. కదిరి, మడకశిర, పెనుకొండలో ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

-పుట్టపర్తి



నామినేషన్ సమర్పిస్తున్న పల్లె సింధూరా రెడ్డి



పుట్టపర్తి రింగ్‌రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఆంక్షలు.. అవస్థలు..

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- పుట్టపర్తిలో ట్రాఫిక్ ఆంక్షలు.. బస్సుల నిలిపివేత
- ఎండలో ఇబ్బందులు పడ్డ విద్యార్థులు



విద్యాగిరి వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 18: ఎన్నికల ఆంక్షలు అవస్థలను తెచ్చిపెట్టాయి. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. దీంతో పుట్టపర్తిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు కఠినతరం చేయడంతోపాటు బస్సులను నిలిపేశారు. ప్రధాన రహదారిని మూసివేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు గణేష్‌కూడలి నుంచి బస్టాండు వరకు వాహనాలను అనుమతించలేదు. గణేష్ కూడలిలోనే ఆపేశారు. దీంతో మండే ఎండలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నడుచుకుంటూ బస్టాండుకు వెళ్లాల్సి వచ్చింది. విద్యార్థులకు వేసవి దృష్ట్యా ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. పాఠశాల ముగించుకుని ఇంటికి బయల్దేరిన చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాలకు అనుమతి లేకపోవడంతో మండే ఎండలో కిలోమీటర్ల మేర ఎనుములపల్లి వైపు, పట్టణంలోకి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. నామినేషన్ల ప్రక్రియ సాగే వారం రోజులూ ఈ తిప్పలు తప్పవా అని జనం వాపోతున్నారు. బస్సులు బస్టాండుకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న రోడ్డును పూర్తిగా మూసివేశారు. ఆధ్యాత్మిక కేంద్రం కావడం, దగ్గరలో సత్యసాయి ఆరాధనోత్సవాల నేపథ్యంలో పుట్టపర్తికి వచ్చే భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వేడెక్కిన రాజకీయం

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- ఆర్భాటంగా దాఖలుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో కూటమి అభ్యర్థుల దూకుడు
- హామీలు నెరవేర్చలేని వైసీపీలో అయోమయం
- ఓటమి భయంతోనే కవ్వింపు చర్యలకు శ్రీకారం
- కూటమి శ్రేణులను అప్రమత్తం చేస్తున్న ముఖ్యనేతలు
- అధికారుల పనితీరుపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

అనంతపురం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో రాజకీయం మరింతగా వేడెక్కింది. తొలి రోజే నామినేషన్ల ప్రక్రియకు పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీకారం చుట్టారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్యనాయకులతో కలిసి కూటమి అభ్యర్థులు, అధికార వైసీపీ అభ్యర్థుల తరపున తొలి రోజు ఒకటి, రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఒకరిద్దరు అభ్యర్థులు స్వయంగా నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ అభ్యర్థులదీ ఇదే పరిస్థితి. కాగా భారీ జన సమీకరణతో ఆర్భాటంగా నామినేషన్ దాఖలు చేయడానికి అధికార, ప్రతిపక్ష పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. నామినేషన్ సమయంలోనే బలాన్ని చూపించుకునేందుకు అభ్యర్థులు సమాయత్తమవుతున్నారు.

గెలుపే లక్ష్యంగా వ్యూహరచన

గెలుపే లక్ష్యంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు వ్యూహ రచన చేస్తున్నారు. విజయానికి తోడ్పడే అన్ని అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణను రూపొందించు కుంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, యువత, మహిళలు, రైతులు, కార్మికుల్లో చైతన్యం నింపే దిశగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అధికార వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ వర్గానికి న్యాయం చేయలేదన్న విషయాన్ని ప్రజలకు బలంగా వివరిస్తున్నారు. కూటమికి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామనే భరోసాను ఇస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గరపడేకొద్దీ ప్రచారంలో మరింత దూకుడు పెంచాలనే యోచనలో కూటమి అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్‌కు మూడు వారాల గడువు ఉన్న నేపథ్యంలో... కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు, అభ్యర్థులు, తలా ఓ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.

మాటలే.. చేతలు లేవు

రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే అధికారమని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికార వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. జిల్లాలోనూ అధికార వైసీపీకి 2 నుంచి 3 స్థానాల కంటే ఎక్కువ సీట్లు రావని సర్వేలు తేలుస్తున్న క్రమంలో ఆ పార్టీ అభ్యర్థులను ఓటమి భయం వెంటాడుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో బటన్ నొక్కుడు తప్పా ఏ ఒక్క అభివృద్ధి పనులు చేయకపోగా... ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ జిల్లాకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. ఇక స్థానికంగా గత ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ అభ్యర్థులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. ఉదాహరణకు అనంతపురం అర్బన్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సిట్టింగ్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాలన ముగుస్తున్నా... ఆ హామీ నెరవేర్చలేకపోయారు. ఇలా జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పరిశ్రమలు ఏ ఒక్కటి తీసుకురాలేదు. ఏ ఒక్కరికి ఉద్యోగాలు కల్పించలేదు. బటన్ నొక్కే సొమ్ము అయినా ఆయా వర్గాల లబ్ధిదారులకు సకాలంలో అందించడం లేదు. ఉద్యోగ వర్గాలకు ఒకటో తేదీ జీతాలు ఇవ్వడంలోనూ ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా మంజూరులోనూ అన్యాయమే జరిగింది.


కేశవ్ తరపున నామినేషన్ వేస్తున్న కుటుంబ సభ్యులు


శింగనమలలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న శ్రావణిశ్రీ


దగ్గుబాటి తరపున నామినేషన్ వేస్తున్న శ్రీనివాసులు

కవ్వింపు చర్యలకు వైసీపీ శ్రీకారం


కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వైసీపీ శ్రేణులు

రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాలు అధికార వైసీపీపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజక వర్గం కేంద్రంలో గురువారం జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనం. ప్రచారంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, శ్రేణులపై స్థానిక వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్య వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఘటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు కూటమి పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు.

పోలీసుల పారదర్శకతపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నది ఎన్నికల కమిషన్ ముఖ్య ఉద్దేశ్యం. అది నెరవేరుతోందా..? లేదా అనేదానిపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతోనే జిల్లా యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లింది. ఇక నోటిఫికేషన్ విడుదలతో పూర్తి స్థాయిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికార యంత్రాంగం, పోలీసులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా కళ్యాణదుర్గంలో వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడిన ఘటన నేపథ్యంలో పోలీసు అధికారులపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం. పారదర్శకంగా పని చేయని అధికారులపై చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్ పరిధిలోని ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో నిఘాను మరింతగా పెంచినట్లు తెలిసింది.

ఓటరుకు సాంకేతిక సహకారం

అందుబాటులో వివిధ యాప్‌లు.. పారదర్శక నిర్వహణకు మార్గాలు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18 : ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతికను వినియోగిస్తోంది. ఓటర్లు, అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు, ఫిర్యాదులు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లను అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా ఓటర్లకు సమస్త సమాచారం అందుబాటులో వుంచింది. పోటీచేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ప్రదర్శనల నిర్వహణ కోసం అనుమతులు తీసుకునేందుకు కూడా వీటి ద్వారా అవకాశం కల్పించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు ఉపయోగపడేలా మరిన్ని యాప్‌లు వున్నాయి.

ఓటరు సాయానికి వీహెచ్ఎస్



ఓటర్ల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్ఏ)పేరిట ప్రత్యేక వ్యవస్థను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో ఓటు నమోదు చేసుకునేందుకు వీలుగా దరఖాస్తులు అందుబాటులో వుంటాయి. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా అన్నది సులువుగా తెలుసుకోవచ్చు. ఈ-ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫిర్యాదులకు ప్రత్యేకం ఎన్జీఎస్



ఓటర్లు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ (ఎన్జీఎస్) పేరిట ఒక పోర్టల్ వుంది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఇందులో నమోదు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యాదులైనా ఇందులో నమోదు చేయవచ్చు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివరాలను పొందుపరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వీటిని పరిశీలించి చర్యలు చేపడతారు.

అభ్యర్థి గురించి తెలుసుకోండిలా..



మీ అభ్యర్థి గురించి తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్, కేవైసీ పేరిట ఒక వెబ్‌సైట్ వుంది. అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసే ప్రమాణ పత్రాల (అఫిడవిట్‌లు) ప్రజలకు అందుబాటులో వుంచేందుకు ఎన్నికల సంఘం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించింది. పోటీలో వున్న అభ్యర్థి ఎలాంటి వారు, వారికి నేర చరిత్ర ఏమైనా వుందా. వారికి ఏయే ఆస్తులు ఎక్కడెక్కడ వున్నాయి. స్థిర చరాస్తుల వివరాలు, బంగారు ఆభరణాల వివరాలను తెలుసుకోవచ్చు

సి-విజిల్‌తో అక్రమాలకు చెక్



ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ఉద్దేశించిన యాప్ ఇది. ప్రజలు తాము గుర్తించిన అక్రమాలను సి-విజిల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదు చేయాలి. వంద నిమిషాల వ్యవధిలో అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని సమాచారం ఆధారంగా చర్యలు తీసుకుంటారు. తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోన్‌కు మెసేజ్ రూపంలో తెలుపుతారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా వుంచడం ఈ యాప్ ప్రత్యేకత.

దివ్యాంగుల చేయూతకు 'సాక్ష్యం'



వయో వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రత్యేకంగా వలంటీర్‌ను అందుబాటులో వుంచుతారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూర్చుతారు.

హామీల్లోనే 'తోపు'

ఒక్కటీ నెరవేర్చని ప్రకాష్‌రెడ్డి
కాలనీకి ఇచ్చిన హామీలు మరిచిపోయారు
రోడ్లు, కాలువలు ఒట్టి మాటలే
ఎమ్మెల్యే తోపుదుర్తిపై సదాశివన్ కాలనీ వాసుల ఆగ్రహం


కాలనీలోని మట్టి రోడ్డు


రోడ్డు కంటే దిగువలో ఉన్న ఇళ్లు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 18: 'మా పార్టీకి ఓటేసి గెలిపించండి. మీ కాలనీలో సమస్యలన్నీ తీరుస్తా' ఇది అనంతపురంరూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీలోని సదాశివన్ కాలనీ ప్రజలకు 2019 లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన హామీ. దీన్ని నమ్మి ఆ కాలనీలో ఉండే పేదలంతా వైసీపీకి ఓటేశారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఎమ్మెల్యే హోదాలో కాలనీకి వచ్చిన తోపుదుర్తి ఆరు నెలల్లో కాలనీ రూపురేఖలు మార్చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, కాలువలు, స్కూల్ ఇతరత్ర అన్నీ ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అంతే ఆ తర్వాత ఏళ్లు గడిచినా ఆ కాలనీవైపు తొక్కి తొంగిచూడలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చిందిలేదు. అబద్ధపు హామీలు ఇచ్చి, మమ్మిల్ని ఇంతగా మోసం చేస్తావా అని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ ఏర్పాటై పదేళ్లు దాటిపోయింది..

వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారితో 2012లో కాలనీ ఏర్పడింది. దాతల సాయంతో కొంత వరకు విద్యుత్ సౌకర్యం పొందారు. స్థానికులంతా కలిసి బోరు వేసుకున్నారు. ఇప్పుడు కాలనీలో 250 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మొదట్లో ఇతర ప్రాంతాల నుంచి రావడంతో స్థానికంగా గుర్తింపు కార్డులు లేపోవడం..స్థానికులమని చెప్పుకొనే పరిస్థితి వారికి లేకుండా ఉండేది. క్రమేనా ఆధార్, ఓటరు కార్డులు ఇతరత్ర కార్డులన్నీ పొందారు. గత ఎన్నికల్లో తమ ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారు. దీంతో స్థానికులు కాలనీలో తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్లు, కాలువలు, ఇళ్లకుపట్టాలు, చెక్ డ్యాం దగ్గరగా ఉండటంతో ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి హామీ ఇచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కాగా స్థానికంగా ఉన్న మట్టి రోడ్లను తవ్వి చెరువులోని బంక మట్టిని తోలి స్థానిక సర్పంచు సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ మట్టిని తోలడం వల్ల వర్షం వస్తే అడుగు తీసి అడుగు పెట్టే పరిస్థితి ఉండదని, దీనికితోడు ఇళ్ల కంటే రోడ్డే ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ అంతా వైసీపీలో చేరాం



తమ సమస్యలు తీరుతాయన్నా ఆశతో కాలనీ మొత్తం వైసీపీలో చేరాం. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇళ్లకు పట్టాలు ఇస్తాం, రోడ్లు, కాలువలు వేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో తిరిగి పది ఇరవై రోజుల తరువాత ఎమ్మెల్యే ఇంటి వద్దకు కొంత మందితో వెళ్లాం. పట్టాలు ఇవ్వలేం. కామరుపల్లి వద్ద జగనన్న కాలనీలో ఇస్తామని చెప్పారు. స్థానికంగా ఇల్లు కట్టుకున్నాం ఎక్కడికీ వెళ్లలేమని చెప్పాం అంతే. మరి ఆయన దగ్గరకు వెళ్లింది లేదు. ఆయన కాలనీకి వచ్చిందీ లేదు.

- మజ్జిగ నారాయణ, స్థానికుడు

ఆరు నెలల్లో ప్రహరీ నిర్మిస్తామన్నారు



పదేళ్లగా ఇక్కడే నివాసముంటున్నాం. గత ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి రోడ్లు, కాలువలు, కాలనీ చెక్‌డ్యాంకు దగ్గరగా ఉండటంతో ఆరు నెలల్లో ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చెప్పారు. మళ్లీ ఎన్నికలే వచ్చాయి కానీ ఆయన ఇచ్చిన హామీ మాత్రం నెరవేరలేదు.

- పోతన్న, స్థానికుడు

ఎలా వస్తోంది.. పోతోంది..?

దొంగదారిలో డబ్బు, మద్యం రవాణా
ఎన్నికల్లో పంచే ఆ సొమ్ము ఎక్కడ..?
రాజకీయనాయకుల సొమ్ము పట్టుబడదా?
దొరికేదంతా వ్యాపారులు, ఇతర వర్గాలదేనా?


జగన్ ఫొటో ఉన్న వాచీ ఇదే

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓట్ల కోసం నోట్లు వెదజల్లనున్నాయి. ప్రతి ఎన్నికలప్పుడూ ఇదంతా మామూలే. ఇలా జరుగుతోందని అందరికీ తెలిసినా ఆ డబ్బు పోలీసులకు మాత్రం దొరికినట్లు కనిపించదు. కర్ణాటక మద్యం రవాణాను కూడా ఏ శాఖ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. జిల్లాలో యథేచ్ఛగా రవాణా అవుతూనే ఉంది. పోలీసులు, సెబ్, ఎక్సైజ్ ఇలా ఎవరూ దాన్ని నియంత్రించలేక పోవడంతో జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాలు దాటి మారుమూల పల్లెలకు సైతం పొంగి పొర్లుతోంది. ఈ నేపథ్యంలో మద్యమే పట్టుకోలేకపో యారు...ఇక డబ్బు మూటలను ఎప్పుడు పట్టుకుంటారనే విమర్శను పోలీసులు మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుతం సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు సామాన్యుల డబ్బు లక్షల్లో సీజ్ చేసినట్లు చెబుతున్నారు కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన ఒక్క పైసాకూడా పట్టుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల్లో పంచే ఆ రూ.కోట్లు ఎక్కడ..?

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి రాజకీయపార్టీలు రూ.కోట్లు వెదజల్లుతుం టాయి. ఇదంతా బహిరంగ రహస్యమే. పోలీసులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారనే విమర్శలున్నాయి. కానీ ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది..? ఎలా వస్తోంది..? ఎవరి ద్వారా ఆయా నేతలకు చేరుతోందనేది అంతుబట్టని విషయం. కొన్ని కంటైనర్ల ద్వారా ఆ డబ్బు చేరుతుందనే ప్రచారం జరుగుతుంటుం ది. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలీసులు జిల్లా సరిహద్దులు, రాష్ట్ర సరిహద్దుల్లో ముమ్మరంగా నిఘా వేశారు. కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన డబ్బు ఎక్కడా పట్టుబడలేదు. ఒకవేళ పట్టుబడినా అది రాజకీయనాయకుల డబ్బు కాదని ఆ దొరికినవారు బుకాయిస్తున్నారో ఏమో తెలియదు. అయితే రాజకీయ నాయకుల ప్రమేయం ఉందనే విషయం మాత్రం బయటకు రావడం లేదు.

సాంబా వాహనంలో దొరికిన వాచీల సంగతేంటి..?

వైసీపీ నేత, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి వాహనంలో ఇటీవల దొరికిన వాచీల సంగతేంటనేది చర్చనీయాంశంగా మారింది. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఉన్న సాంబశివారెడ్డిని పిలుచుకెళ్లడానికి ఆయన వాహనంలో డ్రైవర్, ఎమ్మెల్యే గన్‌మెన్ నాగేంద్రకుమార్ వెళ్తున్న కారులో సీఎం జగన్ ఫొటో ఉన్న వాచీలు తీసుకెళ్లారు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి చెక్‌పోస్టులో పోలీసుల తనిఖీలో ఆ వాచీలు పట్టుబడ్డాయి. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పోలీస్ అధికారులు సైతం గన్‌మెన్‌ను వివరణ అడిగారట. ఆయన తనకేం సంబంధం లేదని చెప్పుకొచ్చారట. ఇక్కడితోనే ఆ వ్యవహారం ముగిసినట్లు తెలుస్తోంది. కర్ణాటక పోలీసులు ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించారా..? ఎన్నికల కమిషన్ ఆ విషయంలో ఏం చేస్తోంది..? అనేది తెలియాల్సి ఉంది.

పోలీస్ చెక్‌పోస్టులను దాటి అక్రమంగా వెళ్తోందా..

రాజకీయనాయకులకు సంబంధించిన డబ్బు పోలీస్ చెక్‌పోస్టులను దాటి అక్రమంగా వెళ్తోందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం డబ్బు తీసుకెళ్తున్న వాహనాల ముందు ఓ ఎస్కార్ట్ వాహనం వెళ్తోందని సమాచారం. ఎక్కడైనా పోలీసులు తనిఖీ చేస్తున్నట్లు కనిపిస్తే దారి మళ్లిస్తున్నారని తెలుస్తోంది. అడ్డదార్లు, దొంగదార్లు తెలిసిన వారు ఇలా తీసుకెళ్తున్నారని సమాచారం. మరో వైపు రాజకీయనాయకులు డబ్బు పంపే మార్గాన్ని సైతం మార్చారనే వాదనా లేకపోలేదు. ఆన్‌లైన్ బదిలీలతో డబ్బు పంపుతున్నారని తెలుస్తోంది.

వాచీలు ఎలా వచ్చాయి...?

జగన్ ఫొటో ఉన్న ఆ వాచీలు ఎన్నికల స్టంటేనన్నది స్పష్టంగా తెలిసిపోతోంది. ఆ వాచీలు ఎంత మొత్తంలో జిల్లాకు వచ్చాయి..? అవి ఎలా రవాణా చేశారనేది అంతుబట్టడం లేదు. ఆ వాచీలు జిల్లాలోకి ప్రవేశించినప్పుడు పట్టుబడి ఉంటే పరిస్థితి సీరియస్‌గా ఉండేదని, మరో రాష్ట్రంలోకి వెళ్తున్నప్పుడు దొరకడంతో అంత యాక్షన్ ఉండకపోవచ్చనే ప్రచారం జరిగింది. అయితే పెద్ద మొత్తంలోనే వాచీలు తీసుకొచ్చారని సమాచారం. కానీ ఆ వాచీలు జిల్లాలోకి వచ్చే సమయంలో పోలీసులు వాటిని ఎందుకు పట్టుకోలేకపోయారనే ప్రశ్నకు సమాధానం లేదు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పంపాల్సిన డబ్బు రూ.కోట్లలో జిల్లాలోని ఓ కీలకనేత వద్దకు చేరిందని చెప్పుకుంటుంటారు. మరి ఇప్పుడు కూడా చేరిందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.



పట్టుబడిన సాంబశివారెడ్డి వాహనం

ఏంటి గురూ.. ఇదంతా..!

సచివాలయ ఉద్యోగులకు తీవ్ర పని ఒత్తిడి
అరకొర సిబ్బందితో ఇబ్బంది పడుతున్న వైనం
జీతాల కోసం పలువురు ఉద్యోగుల నిరీక్షణ
సమస్య చెబితే క్లాస్ పీకుడే!
పామిడి సచివాలయ ఉద్యోగుల దీన స్థితి

పామిడి పని ఒత్తిడి, జీతాలు రాకపోవడంతో పామిడిలోని సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పామిడి పంచాయతీలో ఏడు సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయానికి 11 మందిని ప్రభుత్వం నియమించాల్సి ఉండగా అరకొరకగానే నియమించారు. 76మంది ఉద్యోగులు ఉండాల్సిన చోట 45 మంది(రెగ్యులర్, డెప్యుటేషన్) మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో పంచాయతీ కార్యదర్శులు ఏడుగురుకి గాను ఐదుగురు(ఈ ఓతో కలిపి) ఉన్నారు. వీరిలో నలుగురు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ఏడుగురుకి నలుగురు డెప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ఏడుగురికి ఆరుగురే ఉన్నారు. వీరిలో ఇద్దరు డెప్యుటేషన్, నలుగురు రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఏడుగురికి ఏడుగురు రెగ్యులర్, ఏఎన్ఎంలు ఏడుగురికి ఆరుగురు రెగ్యులర్, మహిళా పోలీసులు ఏడుగురికి ఆరుగురు రెగ్యులర్ కాగా ఒక్కరు డెప్యు టేషన్‌పై పని చేస్తున్నారు. వీఆర్వోలు ఏడుగురికి ఏడుగురు రెగ్యులర్, జూనియర్ లైన్ మెన్ ఏడుగురికి ముగ్గురు రెగ్యులర్, సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు ఏడుగురికి ఒక్కరూ లేరు.


వార్డు సచివాలయం

తీవ్ర పని ఒత్తిడి

పామిడి సచివాలయాల్లో అరకొరక సిబ్బందితో తీవ్ర పని ఒత్తిడి నెలకొంది. దీంతో ఉన్న సిబ్బంది అత్యవసర పని నిమిత్తం సెలవులపై కూడా వెళ్లలేని దుస్థితి. ఒకవైపు ప్రభుత్వ పథకాలు, వివిధ పనులు, మరోవైపు ఎన్నికల విధులతో సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ప్రస్తుత తమ క్యాడర్‌కు... చేస్తున్న పనికి పొంతనలేకుండా పోతోందని వారు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు ఇద్దరు, ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరితోనే చేయించడంపై వారు కలతచెందుతున్నారు. రెగ్యులర్ సచివాలయం ఉద్యోగులకు జనరల్ ట్రాన్స్‌ఫర్లు లేకపోవడం, జీతాలు రాకపోవడం, పని ఒత్తిడి కూడా పెరగడంతో కొందరు ఉద్యోగం వదిలేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. ఎన్నికల తర్వాత బదిలీలు జరుగుతాయేమోనన్న ఆశాభావంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

జీతాలు లేవు

పామిడి సచివాలయాలలో 45 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సుమారు 11 మంది డెప్యు టేషన్‌పై పని చేస్తున్నారు. డెప్యుటేషన్ వారికి మినహా ఇతరులకు జీతాలు సక్రమంగా రావడంలేదు. ఒకరిద్దరికి ఏడాది పాటు రాకపోగా మరికొందరికి పది నెలలుగా, ఇంకొందరికి కొన్ని నెలలుగా జీతాలు రాలేదని సమాచారం. ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లుకు పదినెలలుగా, మహిళా పోలీసులకు ఐదు నెలలుగా, ఏఎన్ఎంలకు నాలుగు నెలలుగా, వీఆర్వోలకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఇలా జీతాలు సక్రమంగా రాకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యను తెలియజేసినా సమస్యే

ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో సచివాలయ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగుల సమస్య పామిడిలో అరణ్య రోదనగా మారింది. తమ సమస్యలను అటు అధికారులకు చెప్పుకోలేక, ఇటు ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేక వారు సతమతమవుతున్నారు. సమస్యను చెబితే అదే పెద్ద సమస్యగా మారుతోందని వారు మథనపడుతున్నారు. ఇలా ఏదైనా సమస్యను చెబితే ఆ ఉద్యోగిని ఓ అధికారి పిలిచి క్లాస్ పీకుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అంతేకాకుండా ఆ ఉద్యోగి ప్రోగ్రెస్‌పై నిఘా పెట్టి తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి తమ సమస్యను తెలిపి కాస్త ఊరట చెందుదామన్నా ఆ వెసులుబాటు కూడా లేకుండాపోయిందని వారు ఆక్రోశిస్తున్నారు.

జీతాలు అందజేసేందుకు కృషి చేస్తాం




పామిడిని నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మార్చడంతో వార్డు సచివాలయాల క్యాడర్ స్ట్రెంత్ మంజూరు కాలేదు. దీంతో వారికి జీతాలు అందజేయడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికే గతంలోని అధికారులు రాష్ట్ర సచివాలయంలో నివేదించారు. ఇది ప్రభుత్వం స్థాయిలో ఉంది. బదిలీపై కొత్తగా రావడంతో నాకు ఈ సమస్య ఇటీవలే తెలిసింది. సచివాలయం ఉద్యోగులకు జీతాలు అందించేందుకు రెండు మూడు రోజుల్లో మరోసారి రాష్ట్ర సచివాలయంలో ప్రయత్నిస్తాం.

- శ్రీనివాసరరావు, ప్రత్యేకాధికారి, పామిడి

జన కేతనం

ఆంధ్రజ్యోతి

అనంతపురం
శ్రీ సత్యసాయి
శుక్రవారం 19 ఏప్రిల్ 2024





అమ్మోరి దయ !

రాజకీయ నాయకులకు బాటసుంకులమ్మ సెంటిమెంట్

గుంతకల్లు నియోజకవర్గంలోని రాజ కీయ నాయకులకు ముందుగా బాటసుంకులమ్మకి పూజలు చేసిన తర్వాతే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం సెంటిమెంట్‌గా మారింది. మండలంలోని కరిడికొండ గ్రామశివారులో 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన బాటసుంకులమ్మ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. నియోజకవర్గంలో కర్నూలు జిల్లా సరిహద్దులో ఈ అమ్మవారు దేవుడి (ఈశాన్య) మూలలో ఉంది. అందుకే అధికార పార్టీ, ప్రతిపక్ష రాజకీయ నాయకులు అమ్మవారి దేవాలయానికి వచ్చి పూజలు చేసిన తరువాత పనులు మొదలు పెడతారు. జిల్లానాయకులకు ఏ పదవి వచ్చిన, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాలో అడుగు పెట్టే ముందు ఈ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత వారి నియోజకవర్గానికి వెళ్తుంటారు.

- గుత్తిరూరల్

బొమ్మల కథ

కోడ్ వచ్చినా స్మార్ట్ మీటర్లపై తొలగని జగన్ బొమ్మ



మంగాపురంలో వ్యవసాయ బోరుబావికి స్మార్ట్‌మీటర్లపై తొలగని బొమ్మలు

వ్యవసాయ విద్యుత్ మీటర్లకు ఏర్పాటు చేసిన జగన్ బొమ్మలను ఎన్నికల కోడ్ వచ్చినా మండలంలో తొలగించలేదు. ఈ మీటర్లకు జగన్ ఫొటో ఉన్న నవరత్నాల స్టిక్కర్లు అతికించారు. స్మార్ట్‌మీటరుపై వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ పథకం పేరు ఉంది. మండల వ్యాప్తంగా 3వేలకుపైగా స్మార్టు మీటర్లు ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో జగన్ బొమ్మ కానరాకుండా చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. - పెనుకొండ రూరల్

సిత్రాలు సూడిరో..



అనంతపురం నగరంలోని రాజీవ్ కాలనీలో ప్రచారంలో భాగంగా డోలు కొడుతున్న టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్

దివంగత నేత పరిటాల రవీంద్ర సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ.. కనగానపల్లి మండలం ముత్తువకుంట్ల నుంచి టీడీపీ రాప్తాడు అభ్యర్థి పరిటాల సునీత గురువారం ప్రచారం నిర్వహించారు. తనయుడు పరిటాల శ్రీరామ్, మనవడు జూనియర్ పరిటాల రవీంద్ర ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ కుటుంబంలో ఏ శుభకార్యం తలపెట్టినా ముత్తువకుంట్ల రామాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభిస్తామని పరిటాల సునీత అన్నారు. గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్ షో నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలను పరిష్కారమౌతాయని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి అండగా నిలవాలని ఆమె గ్రామస్థులను కోరారు. - ధర్మవరం రూరల్





అనంతపురం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ఇది. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కావడంతో ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎండలు మండిపోతుండటంతో వన్ టౌన్ సీఐ రెడ్డెప్ప ఇలా చలివేంద్రంలో కొద్ది సేపు సేదదీరారు.

- అనంతపురం టౌన్





ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామాంజనేయులు

ఎలా వెళ్లేది?



గుంతలమయంగా వెస్టుగేట్ రోడ్, జిల్లాకేంద్రంలో మట్టిరోడ్డులా మారిన రింగ్‌రోడ్డు (ఇన్‌సెట్‌లో)



కంకరతేలిన సత్యసాయి హాస్పిటల్ నుండి బీడుపల్లి వెళ్లేరోడ్డు.. వెస్టుగేట్‌నుంచి పెద్దకమ్మవారిపల్లి వెళ్లేరోడ్డు

పుట్టపర్తిలో పాడైపోయిన రహదారులు.. మరమ్మతులు పట్టించుకోని వైసీపీ పాలకులు

వైసీపీ పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. పక్క రాష్ట్రాల నుంచి ప్రయాణించే సందర్భాల్లో గుంతల రోడ్లు వచ్చాయంటే ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చి ఉంటాం అని ప్రయాణికులు సెటైర్లు వేసేంతగా ఇక్కడి రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్దిగాంచిన పుట్టపర్తిలోని రోడ్లు పరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతోంది. ఇక్కడ నిర్మించిన అవుటర్ రింగ్ రోడ్డు బీటీ రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారిపోయింది. అలాగే ఫోర్‌లేన్ రోడ్డు నుంచి ప్రశాంతి నిలయం వెస్టుగేట్ చేరుకోవడానికి నిర్మించిన రోడ్డు గుంతలమయంగా మారింది. వెస్టుగేట్ రోడ్డు నుండి పెద్దకమ్మవారిపల్లికి వెళ్లే రోడ్డు కంకరతేలి ప్రయాణానికి ఇబ్బంది కలిగిస్తోంది. సత్యసాయి ఆస్పత్రి నుంచి బీడుపల్లి వెళ్లే రోడ్డు కంకర తేలిపోయింది. జిల్లా కేంద్రం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా స్థానిక వైసీపీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్లపై ఉన్న గుంతలకు తట్టెడు మట్టి కూడా వేయించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. - పుట్టపర్తి రూరల్

చరిత్ర ఘనం.. సమస్యలు యథాతథం..



- అనంత నగరంలో అభివృద్ధి అంతంతే
- తీరని తాగునీటి సమస్య
- కలగానే డంపింగ్ యార్డు తరలింపు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ



ఉమ్మడి జిల్లా కేంద్రమైన అనంతపురం నియోజకవర్గానికి ఘనమైన చరిత్రే ఉంది. రాష్ట్రంలోనే అనంతపురం అంటే ఎన్నో చారిత్రక ఘట్టాలకు, ఘటనలకు ప్రసిద్ది చెందింది. విశ్వవిద్యాలయాలు, పీటీసీ, ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్, ఇస్కాన్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి.. ఇలా ఎన్నో ఉన్నాయి. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా విస్తరించిన అనంతపురం నగరంలో సమస్యలు కూడా అలాగే ఉన్నాయి. పాలకులు మారుతున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదనే చెప్పాలి. తాగునీటి సమస్య, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, డంపింగ్ యార్డు ప్రతి ఎన్నికల్లోనూ హామీలుగానే మిగిలిపోతున్నాయి.

అనంతపురం క్రైం: తొలుత మున్సిపల్ పట్టణంగా ఉన్న అనంతపురం క్రమంగా విస్తరించింది. తొలిసారిగా 1952లో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగాయి. మున్సిపాలిటీగా ఉన్న అనంతపురం 2005లో కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. అనంతపురం నియోజకవర్గ పరిధిలో నగరంలో 50 డివిజన్లు, నాలుగు పంచాయతీలు ఉన్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో తాజా గణాంకాల మేరకు 2,78,475 మంది ఓటర్లున్నారు. అందులో 1,36,761 మంది పురుషులు, 1,41,679 మంది మహిళలు, 35మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు.



మొదటిసారి 1952లో ఎన్నికలు

1952 నుంచి ఇప్పటి వరకు 17సార్లు ఎన్నికలు జరగగా, అందులో రెండుసార్లు ఉప ఎన్నికలు నిర్వహించారు. తొలిసారిగా 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1969లో అనంతపురం నియోజకవర్గంలో తొలిసారి ఉప ఎన్నికలు జరిగాయి. 2012లో మరోసారి ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయడంతో పాటు వైసీపీని స్థాపించారు. అదే సమయంలో కొందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. అప్పటి అనంతపురం ఎమ్మెల్యేగా ఉన్న గురునాథరెడ్డి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి మహాలక్ష్మి శ్రీనివాసులుపై వైసీపీ అభ్యర్థిగా గురునాథరెడ్డి గెలుపొందారు. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ తరపున టి.నాగిరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై గెలుపొందారు. అనంతపురం నియోజకవర్గం నుంచి టి.నాగిరెడ్డి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నుంచి డి.నారాయణస్వామి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీటీఎల్‌ఎన్ చౌదరిపై 39,464ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇప్పటి వరకు అనంతపురం నియోజకవర్గంలో ఇదే అత్యధిక మెజార్టీ. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.ఆంథోనిరెడ్డి సీపీఐ అభ్యర్థి గోపాలకృష్ణపై 2,302 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఇదే అత్యల్ప మెజార్టీ. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అత్యధికులు ముస్లింలు. ఈ సామాజిక వర్గ ఓటర్లు ఎన్నికల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆ తరువాత బలిజ సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కానీ ఈ రెండు సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేయడం లేదు.

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1952	తరిమెల నాగిరెడ్డి	సీపీఐ	నీలం సంజీవరెడ్డి	కాంగ్రెస్	11608
1955	పి.ఆంథోనిరెడ్డి	కాంగ్రెస్	ఐ.సదాశివన్	సీపీఐ	7584
1962	పి.ఆంథోనిరెడ్డి	కాంగ్రెస్	బి.గోపాలకృష్ణ	సీపీఐ	2302
1967	తరిమెల నాగిరెడ్డి	సీపీఎం	అనంతవెంకటరెడ్డి	కాంగ్రెస్	2460
1969(ఉ.ఎ)	ఎ.వెంకటరెడ్డి	కాంగ్రెస్	ఐ.సదాశివన్	సీపీఐ	16117
1972	ఎ.వెంకటరెడ్డి	కాంగ్రెస్	కె.ఆర్.రావు	ఇండి	14895
1978	బీటీఎల్ఎన్‌చౌదరి	కాంగ్రెస్ ఐ	మేడా సుబ్బయ్య	జనతా	3335
1983	డి.నారాయణస్వామి	టీడీపీ	బీటీఎల్ఎన్‌చౌదరి	కాంగ్రెస్	39464
1985	ఎన్.రామకృష్ణ	టీడీపీ	ఎ.నారాయణరెడ్డి	కాంగ్రెస్	7421
1989	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	కె.సైపుల్లా	టీడీపీ	22313
1994	కె.రామకృష్ణ	సీపీఐ	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	22364
1999	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	వి.ప్రభాకర్‌చౌదరి	టీడీపీ	3465
2004	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	కెఎం.రహంతుల్లా	టీడీపీ	37781
2009	బి.గురునాథరెడ్డి	కాంగ్రెస్	మహాలక్ష్మిశ్రీనివాసులు	టీడీపీ	13089
2012(ఉ.ఎ)	బి.గురునాథరెడ్డి	వైసీపీ	మహాలక్ష్మి శ్రీనివాసులు	టీడీపీ	24739
2014	వి.ప్రభాకర్‌చౌదరి	టీడీపీ	బి.గురునాథరెడ్డి	వైసీపీ	9334
2019	ఎ.వెంకటరామిరెడ్డి	వైసీపీ	వి.ప్రభాకర్‌చౌదరి	టీడీపీ	28698



అనంతపురం నియోజకవర్గాన్ని పలు

ప్రధాన సమస్యలు

సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న డంపింగ్‌యార్డ్ అత్యంత కీలక సమస్యగా మారింది. ఆ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు మంటలు రావడం, ఆ వచ్చే పొగతో శ్వాసకోశ వ్యాధిన పడుతున్నారు. పలు కళాశాలలు, భవనాలు సైతం ఇప్పటికే మార్చేశారు. నగరంలో పారిశుధ్య సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. అనంతపురం నగరపాలికలో ఎంతో మంది పాలకులు, అధికారులు మారినా నేటికీ ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేయించే విషయంలో వెనుకబడుతూనే ఉన్నారు. ఇక నగరంలో పందులు, దోమలు, కుక్కల బెడద చెప్పనలవి కాదు. ఆవులు ప్రధాన రహదారుల్లోనే మందల కొద్దీ తిరుగుతుంటాయి. మురుగు తీయని కాలువలు, మురికి నీరు పారే కాలువలు ఇక్కడ సర్వసాధారణం. నేటికీ కొన్ని రోడ్లు గుంతలుగానే దర్శనమిస్తున్నాయి. అక్రమ కట్టడాలకు అంతే లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు లంచావతారుల అవతారమెత్తి ఇష్టారాజ్యంగా అక్రమ భవనాలకు అనుమతిస్తున్నారు. దీంతో సందు లేకుండా పెద్ద పెద్ద భవనాలు వెలుస్తున్నాయి. భవిష్యత్తులో ఇదెలాంటి పరిణామాలకు దారి తీస్తుందో తెలియని పరిస్థితి.

నియోజకవర్గ చరిత్ర

రూ.కోట్లు ఖర్చు పెట్టి అనంతపురం నగరానికి పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)నుంచి తాగునీటిని అందిస్తున్నప్పటికీ తరచూ పైపులైన్ లీకేజీలతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. వర్షాలొచ్చినప్పుడు నీరు రంగు మారుతున్నాయని ప్రజలు చెబితే.. అది మామూలే అన్నట్లు అధికారులు కొట్టిపడేస్తుంటారు. శుద్ధి చేసి వచ్చే ఆ నీటిని తాగకుండా ఫిల్టర్ వాటర్‌ను నగర ప్రజలు తాగుతున్నారు. వందల సంఖ్యలో ఇబ్బడిముబ్బడిగా వెలిసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లే ఇందుకు నిదర్శనం. వర్షం వస్తే నగరంలోని చాలా కాలనీల్లోకి ఇళ్లల్లోకి మురుగుతోపాటు వర్షపు నీరు చేరుతుంది. గత ఏడాది వరదలు వచ్చిన సమయంలో పలు కాలనీలే నీట మునిగాయి. పన్ను చెల్లిస్తున్నా ప్రజలకు కనీస వసతులు ఉండటం లేదనేది నగర ప్రజల ఆవేదన. నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీల్లోనూ ప్రధానంగా తాగునీటి సమస్య అధికంగా ఉంది.

ప్రత్యేకతలు..

అనంతపురం నగరంలో టవర్‌క్లాక్ ఒక ప్రత్యేకమని చెప్పవచ్చు. ఈ చారిత్రాత్మక కట్టడం అనంతపురానికి ఒక తలమానికం. అనంతపురం అర్బన్ నియోజకవర్గ విస్తీర్ణం 1334.60 ఎకరాలు. నియోజకవర్గ పరిధిలో అనంతపురం నగరంలో 50 డివిజన్లు, అనంతపురం రూరల్ మండలంలోని 4 పంచాయతీలు ఉన్నాయి. అనంతపురం నగరానికి 2007లో పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) నుంచి నీటిని తీసుకొచ్చి కూడేరు మండలం ముద్దలాపురంలోని ఫిల్టరేషన్ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నారు.


సెంటిమంట



గుంతకల్లుకు వస్తే సీఎం పదవి గోవింద!



గుంతకల్లు పట్టణం



గుంతకల్లు నియోజకవర్గ రేఖా చిత్రం

నియోజకవర్గ కేంద్రమైన గుంతకల్లు పేరు చెబితే పదవిలో ఉన్న ఏ రాజకీయ నాయకుడికైనా జడుసుకుంటాడు. అధికారంలో ఉండి గుంతకల్లుకు వస్తే ఉన్న పదవి ఊడిపోతుందని, ముఖ్యమంత్రులు వస్తే వారి పదవులేకాదు, పార్టీ గెలుపుకూడా గోవిందా అనక తప్పదనే నమ్మకం ఉంది. ముఖ్యమంత్రులుగా ఉన్న విజయభాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి, జనార్దన రెడ్డి, చంద్రబాబునాయుడు గుంతకల్లుకు వచ్చిన తర్వాత పదవులు కోల్పోయినవారే. 1983లో విజయభాస్కరరెడ్డి, 1991లో చెన్నారెడ్డి, 1992లో జనార్దనరెడ్డి, 2004లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో గుంతకల్లుకు వచ్చారు. తదనంతరం జరిగిన ఎన్నికల్లో పార్టీలు పరాజయం పొంది విజయభాస్కరరెడ్డి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవులు కోల్పోయారు. చెన్నారెడ్డి, జనార్దన రెడ్డికి అధిష్టానం కారణంగా పదవులు పోయాయి. ఆర్టీసీ బస్టాండు ప్రారంభోత్సవానికి గుంతకల్లుకు వచ్చిన చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి పదవి జారిపోగా, జనార్దనరెడ్డి సీఎం అయ్యారు. జీఎస్‌బీసీలో పాతకొత్తచెరువు వద్ద బైపాస్ కెనాల్ శంకుస్థాపన కోసం చెన్నారెడ్డి గుంతకల్లు రాగా, తదనంతరం పదవి కోల్పోయారు. దీంతో ఆయన స్థానంలో మరో సీల్డు కవర్ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాస్కర రెడ్డి అధికారంలోకి వచ్చారు. అధికారంలో ఉన్న ఏ నాయకుడైనా, ఇతర జిల్లాలకు చెందిన మంత్రులైనా గుంతకల్లుకు వస్తామంటే స్థానిక నాయకులు ఇక్కడి సెంటిమెంటును వారికి చెప్పి వద్దని వారిస్తుంటా రు. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్ రెడ్డి తదితరులు గుంతకల్లు వచ్చి తదుపరి ఎన్నికల్లో విజయం సాధించి సీఎం పదవిని అధిష్టించడం గమనార్హం. - గుంతకల్లు

మీరు రావడానికి వీల్లేదు!

మీడియాపై పోలీసు ఆంక్షలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18: ఎన్నికల నామినేషన్ తొలిరోజే పోలీసులు ఆంక్షలు విమర్శల పాలవుతున్నాయి. ప్రత్యేకంగా మీడియాపై కఠినంగా వ్యవహరించారు. కనీసం పౌరసంబంధాల శాఖకు వెళ్లడానికి కూడా అనుమతివ్వలేదు. అనంతపురం నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి నామినేషన్లను గురువారం స్వీకరించారు. గత ఎన్నికల సమయంలోనూ అదే కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. ఆ సమయంలో ఆర్డీఓ కార్యాలయంలోపలికి అందరినీ అనుమతించారు. కానీ ఈసారి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆర్డీఓ కార్యాలయానికి దూరంగానే బారికేడ్లు పెట్టి అనుమతించకుండా ఆపేశారు. లలితకళాపరిషత్ వైపు, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వైపు, నేరుగా ఉన్న మరోదారిని పూర్తిగా మూసివేశారు. టూటౌన్ పోలీసులు విలేకరులను డీపీఆర్వో కార్యాలయంలోపలికి సైతం అనుమతించలేదు. ఉద్యోగుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. కొందరిని ఐడీ కార్డు చూపిస్తే కానీ లోపలికి అనుమతించలేదు. ఓ మహిళా ఉద్యోగి కార్డు మరచిపోయానని చెప్పినా వినలేదు. మరో దారి నుంచి వెళ్లాల్సి వచ్చింది. ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ రామాంజనేయులు అక్కడున్న మూడు బారికేడ్ల వద్ద ఐడీ కార్డు చూపినా లోపలికి అనుమతించ లేదు. దీంతో తాము విధులెలా నిర్వర్తించాలంటూ అసహనం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ, డ్వామా, ఫారెస్ట్, హార్టికల్చర్ కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆర్డీఓ కార్యాలయం సమీపంలో పోలీసుల ఆంక్షలు

పొమ్మనలేక పొగ పెట్టారా..?

ఇన్‌చార్జిల పేరిట వేరేచోటుకు..
'పురం' వైసీపీలో విచిత్ర పరిస్థితి

హిందూపురం : సాధారణంగా ఎన్నికల సమయం దగ్గరపడేకొద్ది ఇతరప్రాంతాల్లో ముఖ్య నాయకులెవరైనా ఆ నియోజకవర్గాలకు చెందిన వారుంటే వారిని రప్పించి ప్రచారాలు నిర్వహించడం రాజకీయ నాయకులు చేసే ప్రక్రియ. కానీ హిందూపురం నియోజకవర్గంలో అందుకు విభిన్నంగా జరుగుతోందని అధికార పార్టీ నాయకులే నివ్వెర పోతున్నారు. నియోజకవర్గంలో మొదటి నుంచి వైసీపీలో అసమ్మతిపోరు రగులుతూనే ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలో అంతర్గతపోరుతోపాటు అసమ్మతి వర్గం ఎప్పటికీ ఉంది. ప్రస్తుత అభ్యర్థి వర్గం అవలంభిస్తున్న తీరు విచిత్రంగా ఉందని అంటున్నారు. నియోజకవర్గంలో నలుగురు ముఖ్య నేతలుండగా వారిలో ఇద్దరు నేతలను ఎన్నికలు దగ్గరపడేకొద్ది ఇక్కడ ఉండకుండా బయట నియోజకవర్గాలకు పంపితే తాము ఎన్నికలు చేసుకుంటామని, లేదంటే తమ చేతకాదంటూ అభ్యర్థి దీపికా వర్గం పెద్దిరెడ్డివద్ద వాపోయినట్లు విశ్వసనీయ సమాచారం. వారు నియోజకవర్గంలో ఉంటే తమను ఓడిస్తారని మంత్రి వద్ద మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధికార పార్టీలో దీనిపైనే చర్చ సాగుతోంది. దీంతో వారిని పొమ్మనలేక ఇన్‌చార్జ్‌ల పేరుతో పంపించేస్తున్నట్లు అధికార పార్టీలో చర్చించుకుంటున్నారు. ఇదే కోవలో హిందూపురం నియోజకవర్గంలో మాజీ సమన్వయకర్తను వేరే నియోజకవర్గంలో ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారు. మరో నేతను కూడా త్వరలోనే మరో నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పంపుతున్నట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ఇటీవల నియోజకవర్గంలో కొంతమంది పార్టీని వీడుతుండటం వెనుక ఓ అధికార పార్టీ ముఖ్యనేత హస్తం ఉన్నట్లు మంత్రికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పురం వైసీపీలో విచిత్ర పరిస్థితి

ఉమ్మడిజిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్య నేతలను నియోజకవర్గానికి దూరంగా ఉంచుతున్నారు. ఎన్నికల సమయంలో ముఖ్య నేతలు ఉంటే ఆర్థికపరమైన అంశాలు బయటకు పొక్కుతాయని దీనివల్ల ఒకే వర్గం ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నట్లు సమాచారం. కానీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఈ నియోజకవర్గంలో వైసీపీ నాయకులను పార్టీలోకి చేర్చుకుని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారంలోకి దింపుతోంది. అధికార పార్టీలో ఉన్న నేతలను బయటకు పంపడం చూస్తే ఇక్కడ రాజకీయం విచిత్ర పరిస్థితి నెలకొందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా ముఖ్య నేతలను పొమ్మనలేక ఎన్నికల ఇన్‌చార్జ్‌ల పేరుతో బయటకు పంపడం సర్వత్రా చర్చనీయాంశమయింది.



జనసేనలోకి పలువురి చేరిక



జనసేనలోకి చేరిన వారితో చిలకం మధు

ధర్మవరం, ఏప్రిల్ 18: పట్టణంలోని 37వ వార్డు మాజీ కౌన్సిలర్ వెంకటరెడ్డి, మాజీ సైనికుడు రమణారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, రామచంద్రనాయుడు, నారాయణ స్వామి, ఓబులేసు, సురేశ్‌నాయుడు, శ్రీరాములు, కుమార్ తదితరులు జనసేనలోకి చేరారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో గురువారం వారు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వారికి చిలకం మధు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థికి బీఫాం అందజేత



మధుసూదనరెడ్డికి బీఫాం ఇస్తున్న వైఎస్ షర్మిల

పుట్టపర్తి, ఏప్రిల్ 18: పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దాదిరెడ్డి మధుసూదనరెడ్డికి ముందస్తుగానే బీఫాం అందింది. గురువారం ఉమ్మడి జిల్లా పర్యటనకు విచ్చేసిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నార్పల సమావేశంలో మధుసూదన్ రెడ్డికి బీఫాం అందజేశారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధర్మవరం, ఏప్రిల్ 18: అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14న నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో ధర్మవరం క్రీడాకారులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పట్టణంలోని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ధర్మవరానికి చెందిన క్రీడాకారులు నిఖ్య, సల్మా, కిరణ్మయి, తరుణ్ ఎంపికయ్యారన్నారు. కృష్ణా జిల్లా నూజివీడులో ఈనెల19 నుంచి 22వతేదీ వరకు జరిగే 9వ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలలో వీరు పాల్గొంటారన్నారు. వీరిని శెట్టిపి జయ చంద్రారెడ్డితో అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ అభినందించారు.

టీడీపీ కార్యకర్తల సమావేశం

గాండ్లపెంట, ఏప్రిల్ 18: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. మండలంలోని పలు పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేసేందుకు తేదీలు ఖరారు చేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్‌పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కందికుంటను గెలిపించుకునే బాధ్యత అందరిదీ అని పేర్కొన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, నాయకులు చంద్ర, అక్రమ్‌బాషా, యూనూస్, ఉమ్మర్‌అలీ, టోపీసాబ్, నరసింహులు జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

జోరుగా నాటుసారా అమ్మకాలు

- కట్టడి చేయడంలో పోలీసులు విఫలం



వెంకటతిమ్మాపురంలో నాటుసారా ప్యాకెట్లు

ధర్మవరంరూరల్, ఏప్రిల్18: మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామంలో నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విచ్చలవిడిగా నాటుసారా తయారుచేసి ప్యాకెట్లలో విక్రయాలు జరుపుతున్నారు. గ్రామ పరిసర కొండ, చెరువు ప్రాంతాల్లో నాటుసారాను తయారుచేసి విక్రయాలు జరుపుతున్నట్లు ఆ గ్రామ మహిళల ద్వారా తెలుస్తోంది. ఎన్నికల వేళ గ్రామాల్లో నాటుసారా తయారీని, అమ్మకాలను కట్టడి చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసినా.. వాటిని అదుపుచేయడంలో పోలీసులు, సెబ్ పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల వేళ వీటిని కట్టడిచేయకపోతే ఓటర్లకు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందిం చి నాటుసారాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

23 నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 18: ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం తెలిపారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాదాపు 22వేల మంది పరీక్ష ఫీజు చెల్లించారని, వారి హాల్ టికెట్స్ జ్ఞానభూమి పోర్టల్ ద్వారా కళాశాలల ప్రిన్సిపాల్స్ లాగిన్‌కు పంపామని తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్స్‌గా ఆయా కేంద్రాల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారని తెలిపారు.

జగన్ ప్రభుత్వంలో ఎస్సీలకు అన్యాయం

ముదిగుబ్బ, ఏప్రిల్ 18: జగన్ ప్రభుత్వంలో ఎస్సీలకు అన్యాయం జరిగిందని బీజేపీ ఎస్సీ సెల్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో గురువారం ఆయన ఎస్సీ నాయకులు, మహిళలతో సమావేశం నిర్వహించారు. ధర్మవరం ఎమ్మెల్యేగా గా కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌ను, హిందూపురం ఎంపీగా బీకే పార్థసారథి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి కాలనీ వాసులకు తెలియజేశారు. సీఎం జగన్ ఎస్సీలకు చేసిందేమి లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు అన్యాయం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి సోమల ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తంగేడు గుంట ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

కందికుంట ప్రచారానికి విశేష స్పందన



రాజంవాండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట

నల్లచెరువు, ఏప్రిల్ 18: మండలంలో గురువారం టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ చేపట్టిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. గ్రామాల్లో ప్రజలు అడగడుగునా అపూర్వ స్వాగతం పలికారు. మండలంలోని రాజంవాండ్లపల్లి, రాజంవాండ్లపల్లితండా, పోలేవాండ్లపల్లి, పూలకుంటపల్లి, బాలేపల్లి ఎగువ, దిగువ తండాలు, పి.కొత్తపల్లి గ్రామాల్లో కందికుంట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లోకి రాగానే స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం ఆయన ఇంటింటా తిరుగుతూ.. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. చంద్రబాబు సీఎం అయితే చేపట్టే అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలను తెలిపారు. ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలని, కూటమిని గెలిపించాలని కోరారు. ప్రచారంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతిపరుల ఆట కట్టిస్తా..

అవినీతి పరుల ఆటకట్టిస్తానని కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. రాజంవాండ్లపల్లితండాలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించిన భూమిని బాలేపల్లి తండా సర్పంచ్ తన సొంత భూమిగా చూపించి అమ్మేయడం దారుణమన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు సైతం మాయం చేశారన్నారు. రాజంవాండ్లపల్లి తండాలో 30కుటుంబాల వారు ఇళ్ల పట్టాలు పొందలేకపోయారని, తాము అధికారంలోకి వస్తే వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ సర్పంచ్ అధీనంలో ఉన్న ఒకటిన్నర ఎకరా భూమిని రికవరీ చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని తెలిపారు. దొంగలను బట్టలిప్పి పోలీస్ స్టేషన్‌లో కూర్చోపెడతానన్నారు. వైసీపీ అరాచక శక్తులను తరమి కొడతాని పేర్కొన్నారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమిని గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు నాగభూషణంనాయుడు, జక్కా లక్ష్మీనారాయణ, అనిల్‌నాయుడు, బీజేపీ నేత ఇంతియాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి తండావాసుల చేరిక

నల్లచెరువు మండలం రాజంవాండ్లపల్లితండా, బాలేపల్లి ఎగువ, దిగువ తండాలకు చెందిన 45 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో తిరుపాలమ్మ, గంగులమ్మ, మంజులమ్మ, నారాయణనాయక్, క్రిష్టానాయక్, వంశీనాయక్, వెంకటరమణనాయక్, అనిల్‌నాయక్, సోమునాయక్ గోవిందునాయక్ తదితరులు ఉన్నారు.

18వ వార్డులో యశోదాదేవి ప్రచారం



18 వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదాదేవి

కదిరి: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి కందికుంట యశోదాదేవి గురువారం పట్టణంలోని 18వ వార్డులో ప్రచారం చేశారు. ఆమె టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. చంద్రబాబు సీఎం అయితే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. అలాగే నియోజకవర్గం అభివృద్ధికి కందికుంట కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హనుమంతు, తెలుగు యువత నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా పల్లె సింధూర నామినేషన్

- భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్న పల్లె రఘునాథరెడ్డి, సింధూర, వెంకట కృష్ణ కిశోర్ రెడ్డి

పుట్టపర్తి, ఏప్రిల్ 18: జిల్లాకేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నామినేషన్ల ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మొదటిరోజు గురువారం సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. దశమి మంచిరోజు కావడంతో కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డితో పాటు ఆమె భర్త పల్లె వెంకట క్రిష్ణకిశోర్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి నామినేషన్లు వేశారు. ఉదయం 9:30 గంటలకు స్థానిక అంజనేయ స్వామి ఆలయంలో పల్లె కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి పార్థసారధి, కూటమి పార్టీల శ్రేణులతో కలిసి గణేష్‌కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు శుభముహూర్తం చూసుకుని పల్లె సింధూరరెడ్డితో పాటు వారందరూ ఆర్‌ఓ కార్యాలయం చేరుకున్నారు. అక్కడ సింధూరరెడ్డితో పాటు పల్లె రఘునాథరెడ్డి, పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు ఆర్‌ఓ భాగ్యరేఖకు అందజేశారు. నామినేషన్ అనంతరం గణేష్‌కూడలి చేరుకున్నారు. అక్కడ పార్టీ శ్రేణులను ఉద్దేశించి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడారు. మరోమారు జగన్ ముఖ్యమంత్రి ఐతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. కనుక సైకో పాలనకు అంతం పలకాలన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమిని గెలిపించాలని పిలుపినిచ్చారు. పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమితోనే సుపరిపాలన సాధ్యమన్నారు. ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా తనను భారీ మెజారిటీ గెలిపించాలని కోరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీనాయకులు మాజీ మంత్రి నిమ్మల, సామకోటి ఆదినారాయణ, వీసీ గంగన్న, పత్తి చంద్రశేఖర్, అబ్దుల్, ఆదినారాయణరెడ్డి, శ్రీరామిరెడ్డి, రామాంజనేయులు, విజయ్‌కుమార్, రామలక్ష్మణ్ సోదరులు, శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్‌తో పాటు ఆరుమండలాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఒకే ఇంటి నుంచి మూడు నామినేషన్లు

జిల్లాలో ఒకే ఇంటి నుంచి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల మొదటి రోజు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటుంబం మూడునామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో కూటమి అభ్యర్థిగా కోడలు పల్లె సింధూర, టీడీపీ అభ్యర్థిలుగా కుమారుడు పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి నామినేషన్లు ఆర్‌ఓ భాగ్యరేఖకు అందజేశారు. కొత్తజిల్లాలో మొదటి రోజు ఒకే రోజు ఒకే ఇంటినుండి మూడు నామినేషన్లు దాఖలు కావడం విశేషం.

భవనమెక్కిన అభిమానం



భవనమెక్కి ర్యాలీని వీక్షిస్తున్న కార్యకర్తలు

పల్లె కుంటుంబ నామినేషన్ల కార్యక్రమానికి పుట్టపర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు భారీగా తరలివచ్చాయి. ఆరు మండలాలనుంచి పెద్దఎత్తున తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులను చూడడానికి కొందరు ఎత్తైన భవనాలపైకి ఎక్కి వీక్షించారు. మాఅభిమానం భవనమంత అంటూ చాటారు, మహిళలైతే మాజెండా పసుపుజెండానే కాదు మావస్త్రాలు కూడా పసుపేనంటూ అభిమానాన్ని చాటారు. పుట్టపర్తి వీధులన్నీ పసుపుమయ్యాయి.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఓబుళదేవరచెరువు: మండలంలోని కొండకమర్లకు చెందిన వైసీపీ యువనాయకులు ఎద్దుల ప్రమోద్‌కుమార్ రెడ్డి, ఎద్దుల మహేశ్వరరెడ్డి తన అనుచరులతో గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ సమక్షంలో వారు పార్టీలోకి చేరారు. పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండలకన్వీనర్ శెట్టివారి జయ చంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి ఉన్నారు.

కూటమి గెలిస్తే.. వృద్ధులకు రూ.4వేలు పింఛన్

ధర్మవరంరూరల్, ఏప్రిల్18: కూటమి ప్రభుత్వం ఏర్పడిగానే ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన అనంతరం వృద్ధులకు రూ. 4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ అందజేయడం జరుగుతుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పోతుకుంట, బీసీకాలనీలో గురువారం వారు బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌లను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడగానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, తలారి వెంకటలక్ష్మి, రవి, సునంద, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బీజేపీ నాయకులు అశోక్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని కురమామిడి పంచాయతీలోని పాయకట్టు, గొల్లపల్లి, పోతులవాండ్లపల్లి, పచార్లమేకల తండా, రెక్కమాను గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యేడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, వృద్ధులకు రూ. 4 వేలు పింఛన్లు, చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి యేడాదికి రూ.15వేలు, నిరుద్యోగులకు ఉపాధి, భృతి ఇలా ప్రతికుటుంబానికి లబ్ధిచేకూరుతుందని తెలిపారు. చంద్రబాబు సీఎం అవగానే ఈ పథకాలన్ని అమలవుతాయని పేర్కొన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ కొండయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారపార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి..

- ఇంటి మెట్ల కూల్చివేత
- బాధితులు కేశవరెడ్డి, చెన్నారెడ్డి ఆవేదన



ఇంటి మెటికలను తొలగించిన దృశ్యం

ధర్మవరం, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార పార్టీలో కొందరు నాయకుల ఒత్తిడికి మున్సిపల్ అధికారులు తలొగ్గి తాము నిర్మాణం చేపడుతున్న ఇంటి మెట్లను గురువారం ధ్వంసం చేశారని పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన కోళ్లమొరం కేశవరెడ్డి, కోళ్లమొరం చెన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని కొందరు అధికారులు స్థానిక ప్రజాప్రతినిధికి ఊడిగం చేస్తున్నారన్నడానికి ఇంతకంటే నిదర్శనం ఏముందంటూ బాధితులు అధికారపార్టీ తీరుపై ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. తాము నిర్మాణం చేపడుతున్న ఇంటి పక్కనే రోడ్డంతా ఆక్రమించిన వారిని పట్టించుకోలేదని, తాము అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నామని కక్షతో కూల్చివేతకు దిగారని వాపోయారు. ధర్మవరంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే మూడు సార్లు నోటీసులు ఇచ్చి వాటిని తొలగించాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం తమకు అలా నోటీసులు ఇచ్చారో లేదో వెంటనే తమకే తెలియకుండా ఇంటిమెట్లను పూర్తిగా తొలగించారని విలపించారు. ఇచ్చిన నోటీసుకు సమాధానం ఇచ్చేలోపే అధికారి పార్టీకి ఊడిగం చేసే కొందరు అధికారులు కూల్చివేతకు దిగారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నామినేషన్ల కేంద్రం వద్ద 144 సెక్షన్



నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



కేంద్రం ఎదుట బందోబస్తులో సీఐ సుబ్రమణ్యం

ధర్మవరం, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడింది. నోటిఫికేషన్ రోజు నుంచే నామినేషన్లను స్వీకరణ ప్రారంభమైంది. నామినేషన్ స్వీకరణ కేంద్రం (ఆర్డీఓ కార్యాలయం) వద్ద వందమీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలు చేశారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐసుబ్రమణ్యం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అభ్యర్థితో సహా మొత్తం ఐదుగురికే నామినేషన్ కేంద్రానికి వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు తమ నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా 100కు ఫోన్ చేస్తే తక్షణమే పోలీసులు అక్కడికి చేరుకుని శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడనున్నారు. ఇందుకు సంబంధించి సెంట్రల్ ఫోర్స్ కూడా అందుబాటులోఉండేలా ఏర్పాట్లు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలోనే అభ్యర్థులు తమ వాహనాలను నిలిపివేసి నామినేషన్ పత్రాలు దాఖలు చేసి వెళ్లాల్సి ఉంటుంది.

ఆదమరిస్తే అంతే సంగతి

- చిల్లగోర్లపల్లికి వెళ్లే రోడ్డుపై రక్షణ గోడలు లేకుండా ఉన్న కల్వర్టు
- ప్రమాదాల భారిన పడుతున్న వాహనదారులు



కల్వర్టు వద్ద కింద పడిన ఆటో (ఫైల్)

నల్లమాడ, ఏప్రిల్ 18: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో చిల్లగోర్లపల్లికి వెళ్లే రోడ్డుపై కల్వర్టు రక్షణ గోడలు లేక ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆ కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. ఆ కల్వర్టు సమీపంలోనే ఆటోలు నిలుపుతారు. రోడ్డుపై నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు వద్ద ఏమాత్రం ఏమరుపాటుగా వ్యహరించినా కిందకు పడిపోవాల్సిందే. అంతేకాకుండా కల్వర్టు వద్ద ఎదురుగా ఏదేని నాలుగుచక్రాల వాహనం ఎదురుగా వచ్చినా .. మరో వాహనానికి ముందుకు వెళ్లేందుకు ఆస్కారం ఉండదు. తిరిగి రివర్స్ వెళ్లాల్సిందే. ఇప్పటికే చాలామంది వాహనదారులు అక్కడ ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. ఇటీవల ఓ ఆటో కల్వర్టు వద్ద కిందకు పడిపోయింది. అయితే అందులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా సంబధితాధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ధర్మవరాన్ని చేనేత హబ్‌గా మారుస్తా

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్
- బీజేపీలోకి చేరిన గిర్రాజు నగేశ్



సత్యకుమార్ సమక్షంలో బీజేపీలోకి చేరుతున్న గిర్రాజు నగేశ్

ధర్మవరం, ఏప్రిల్ 18: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధర్మవరం పట్టణాన్ని చేనేత హబ్‌గా మారుస్తానని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని పుట్లమ్మ ఆలయం వద్ద గురువారం ఆయన చేనేతలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పుట్లమ్మ సాక్షిగా చెబుతున్నానని, తాను అవినీతిమరకకు ఆమడ దూరంగా ఉంటానని, ధర్మవరాన్ని చేనేత హబ్‌గా మారుస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి స్వలాభం చూసు కున్నారే కానీ.. ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గాన్ని పూర్తిగా నాశనం చేశారన్నారు. చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయాల్సింది పోయి.. చేనేతలకు ఇబ్బందులు కల్పించడం బాధాకరమన్నారు. వైఎస్ జగన్ సీఎం కాకమునుపు ధర్మవరానికి వచ్చి చేనేతల కోసం దీక్షలు కూడా చేశారని, అయితే సీఎం అయిన తరువాత చేనేతల సంక్షేమం కోసం ఏమి చేశారని ప్రశ్నించారు. ఎన్నికల్లో చేనేతలందరూ వైసీపీని ఇంటికి పంపాలని కోరారు. తొలుత వైసీపీ చేనేత విభాగంరాష్ట్ర ప్రధానకార్యదర్శి, చేనేత వ్యాపారి గిర్రాజు నగేశ్‌తోపాటు పలువురు సత్యకుమార్ సమక్షంలో బీజేపీలోకి చేరారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎల్ నరేంద్రచౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్ కుమార్, కమతం కాటమయ్య, బీజేపీ నాయకులు జింకా చంద్ర, గుండా పుల్లయ్య, సాకే ఓబు లేశు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డులలో సత్య కుమార్ ప్రచారం



సత్యకుమార్‌తోకలిసిప్రచారంలోపాల్గొన్నచిలకం మధు

ధర్మవరం: పట్టణంలోని 27, 28, 29వ వార్డులలో సత్యకుమార్ జనసేనరాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి ప్రజలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత వారు ఇంటింటికీ ప్రజల్ని ఆప్యాయంగా పలకరిస్తూ.. కూటమిని గెలిపించాలని కోరారు. కమలం గుర్తు చూపుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. సత్యకుమార్ మాట్లాడుతూ... తాను మాటలు మనిషిని కాదని చేతల మనిషినని అన్నారు. ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే ధర్మవరం నియోజకవర్గాన్ని ఎవరూ చేయనంత అభివృద్ధిని చేసి చూపుతానని తెలిపారు. వైసీపీ పాలకుల అరాచకాలకు నియోజకవర్గం అతలాకుతలమైందన్నారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రామరాజ్యాన్ని తీసుకొస్తానని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు పాలన పట్ల ప్రతి ఒక్కరు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోట్లమర్రి గ్రామస్థుల వనభోజనాలు



వనభోజనాలు ముగించుకుని ఇంటికి వస్తున్న గ్రామస్థులు

బత్తలపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని పోట్లమర్రి గ్రామస్థులు గురువారం వనభోజనాలకు వెళ్లారు. శ్రీరాముడు వనవాసం చేసినందుకు గుర్తుగా ఈ గ్రామస్థులు శ్రీరామ నవమి మరుసటి రోజున వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయాన్నే వారు కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి గ్రామశివార్లలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి వనభోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపి ఆ తర్వాత ఇళ్లకు చేరుకున్నారు.

నామినేషన్‌కు భారీగా తరలిన కూటమి శ్రేణులు

నల్లమాడ/ ఓబుళదేవరచెరువు/ బుక్కపట్నం: ఏప్రిల్ 18: జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి నామినేషన్‌కు నల్లమాడ మండల నుంచి కూటమి పార్టీల నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో వారందరూ బయలుదేరి వెళ్లారు. అలాగే ఓడీసీ మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. వెళ్లినవారిలో మండలకన్వీనర్ జయ చంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఇక బుక్కపట్నం మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. కొండాపురం గ్రామానికి చెందిన డీలర్ల సంఘం మాజీ అధ్యక్షుడు పుట్టపర్తి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో తరలి వెళ్లారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 18: వచ్చే నెలలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలో ఓటరై ఉండి పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా ఎలెక్షన్ విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 తీసుకోవచ్చన్నారు. ఆర్డర్ కాపీ, ఫొటో, ఎపిక్ కార్డును తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 18నుంచి 24లోగా అందించాలన్నారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా

గోరంట్ల, ఏప్రిల్ 18: మండలంలో 31మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మందపల్లి -2లో ఏడుగురు, గోరంట్ల పంచాయతీనుంచి 24మంది వలంటీర్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు రాజీనామా పత్రాలు అందించారు. మండలంలో మొత్తం 140మంది పనిచేస్తుండగా... ఇప్పటివరకు 92మంది రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు.

అగళి : మండలంలోనరి హళ్లికెర గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. వలంటీర్లు రంగనాథ్, రమేష్, జగదీశ్‌కుమార్, మంజునాథ్, లింగరాజ్ తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌కు అందజేశారు.

పురానికి చేరుకున్న బాలకృష్ణ

- నేడు మధ్యాహ్నం 12.10కి... బాలయ్య దంపతుల నామినేషన్
- సాయంత్రం భారీ ర్యాలీ



పురంలో బాలయ్యకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 18 : టీడీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సాయంత్రం పురానికి చేరుకున్నారు. మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను శుక్రవారం మధ్యాహ్నం 12.10కు ఆయన ఆర్‌ఓకు అందజేయనున్నారు. అయితే ఈ సారి బాలకృష్ణతో పాటు ఆయన సతీమణి నందమూరి వసుంధరాదేవి కూడా డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు ఇదే సమయానికి అందజేయనున్నారు. బాలయ్య దంపతులు శుక్రవారం స్థానిక సూగూరు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కొద్దిమందితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. అనంతరం సాయంత్రం సూగూరు ఆలయం నుంచి వేలాది మందితో ర్యాలీ నిర్వహించనున్నట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు.

బాలయ్యను సత్కరించిన జిల్లా అధ్యక్షుడు

టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సత్కరించారు. పురానికి చేరుకున్న బాలకృష్ణను కొల్లకుంట అంజినప్ప కుటుంబ సభ్యులు కలిసి సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధితో పాటు బాలయ్య గెలుపులో వడ్డెర్లు కీలకంగా పనిచేస్తారని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. బాలకృష్ణ మాట్లాడుతూ పార్టీచేసిన సేవను గుర్తించి జిల్లా అధ్యక్ష పదవి వచ్చిందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తూ జిల్లాలో అందరినీ కలుపుకుని పనిచేయాలన్నారు.



బాలకృష్ణను సత్కరిస్తున్న కొల్లకుంట అంజినప్ప కుటుంబ సభ్యులు

'పురం'లో ఒక్క నామినేషన్ దాఖలు

హిందూపురం, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా భాగంగా హిందూపురం అసెంబ్లీ స్థానానికి మొదటిరోజు గురువారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలైనట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్‌లు వేసే అవకాశం కల్పించారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా శ్రీరాములు నామినేషన్ దాఖలు చేశారు.

పెనుకొండ, మడకశిరలో నిల్

పెనుకొండ : స్థానిక ఎమ్మెల్యే స్థానానికి మొదటి రోజైన గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అపూర్వభరత్ తెలిపారు. పెనుకొండ అసెంబ్లీకి సంబంధించి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

మడకశిరటౌన్: స్థానిక ఎమ్మెల్యే స్థానానికి తొలిరోజు గురువారం ఎలాంటి నామినేషన్లు దాఖలుకాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్ తెలిపారు. అలాగే ఎన్నికల ఖర్చుల పరిశీలకులు వినాయక్ గురువారం సాయంత్రం మడకశిర తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో సమావేశం నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ, ఏప్రిల్ 18 : మండలంలోని కేఎన్‌పల్లికి చెందిన ఇద్దరి నుంచి గురువారం 97 పాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ముని ప్రతాప్ ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. కరెకెర చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టుబడినట్లు తెలిపారు.

టీడీపీతోనే చేనేతలకు పూర్వవైభవం

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఏప్రిల్ 18 : రాష్ట్రంలో ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో కుదేలైన చేనేత రంగానికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే పూర్వ వైభవం వస్తుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె గురువారం సోమందేపల్లిలోని ద్వారకామయినగర్, స్నేహలతనగర్, రాంబాబుకొట్టాల కాలనీల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో సూపర్‌సిక్స్ పథకాల ప్రాముఖ్యతను ఆమె ప్రతి ఒక్కరికి వివరించారు. అలాగే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీలు సవిత సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమందేపల్లిలో చాలా మంది చేనేత రంగంపై ఆధారపడి ఉన్నారని, అలాంటి రంగం ఈ ఐదేళ్లలో కనుమరుగైందన్నారు. వైసీపీ ప్రభుత్వం నుంచి ఆదరణలేక చేనేత కార్మికులు కూలి పనులకు వెళ్తున్నారన్నారు. కుటుంబ పోషణభారమై అప్పుల బాధ తట్టుకోలేక పలువురు మృతిచెందారన్నారు. నేతన్న నేస్తం పథకం లబ్ధి అంతంత మాత్రమే అన్నారు. ఆహారం అందించే రైతన్న దేశానికి ఎంత అవసరమో, వస్త్రాన్ని అందించే నేతన్న అంతే అవసరమన్నారు. అగ్గిపెట్టెలో ఆరడుగుల చీర నేసి ప్రపంచాన్ని అబ్బురపరిచిన ఘనత మన చేనేత కళాకారులదన్నారు. ఇలాంటి పరిశ్రమ వైసీపీ తీరుతో అంధకారంలో నెట్టుకొస్తోందన్నారు. టీడీపీ హయాంలో చేనేతలకు చంద్రబాబు అండగా ఉండేవారని.. ముడిసరుకు, రంగులపై సబ్సిడీ ఇచ్చారన్నారు. చేనేత సహాయనిధి ద్వారా కోట్లనిధులు, మర మగ్గాలకు రాయితీ, కుటుంబాలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్, 50ఏళ్లు దాటినవారికి రూ.2వేలు పింఛన్ అందించారని వివరించారు. ఇలా చేనేత రంగాన్ని రక్షించింది, కార్మికులకు వ్యక్తిగతంగా ఊరటనిచ్చింది టీడీపీ యేనన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పథకాలన్నీ రద్దు చేసిందన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమని చేనేత పరిశ్రమను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుగంటి చంద్ర, సురేష్, కిష్ట, డీవీ ఆంజనేయులు, కన్వీనర్ సిద్ద లింగప్ప, నాగమణి, అశ్వత్థ, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మగ్గం నేస్తున్న సవిత, పార్టీ కండువావేసి మైనార్టీలను ఆహ్వానిస్తున్న దృశ్యం

వైసీపీ నుంచి 20మంది మైనార్టీలు టీడీపీలు చేరిక

గోరంట్ల: పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు, పారిశ్రామిక వ్యాపార వేత్త వైసీపీ నాయకుడు హసేన్ ఖాన్ టీడీపీలో చేరారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు నబీరసూల్, మల్లాపల్లి బాలక్రిష్టారెడ్డితో పాటు 20మంది అనుచరులు టీడీపీలో చేరారు. వారికి స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్వీనర్ సోమశేఖర్, అశ్వత్థరెడ్డి, ఉమ్మర్‌ఖాన్ తదితరులున్నారు.

'ఆరోగ్యకర జీవనశైలితో నోటి క్యాన్సర్ దూరం'

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 18: ఆరోగ్యకరమైన జీవన విధానంతోనే నోటి క్యాన్సర్ నివారించవచ్చని దంత వైద్యులు భూపాళం విజయ్ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వెల్‌స్కోప్ అనే నూతన పరికరం ద్వారా నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు అవగాహన లేమితో నోటి క్యాన్సర్ వ్యాప్తి చెందుతోందన్నారు. మొత్తం 31 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో ఇద్దరికి నోటి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించి ప్రాథమిక చికిత్సలు అందించామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లింగణ్ణ, ఆర్ఎంఓ రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తేనే రాష్ట్రానికి మనుగడ

మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

రొళ్ల, ఏప్రిల్ 18: తెలుగుదేశం పార్టీని గెలిపించుకుంటేనే రాష్ట్రానికి మనుగడ సాధ్యమవుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మండలం లోని వన్నారనపల్లిలో ఎన్నికల ప్రచార కార్యక్రమానికి వచ్చిన సునీల్‌కుమార్‌కు యువకులు డప్పు వాయిద్యాలతో, మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. మహిళలు నృత్యం చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు, మహిళలు టీడీపీకి ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు అఖండ విజయం చేకూర్చాలని గ్రామస్థులను అభ్యర్థించారు. ఇంటింటికీ బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ... సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, ఐటీడీపీ జగదీష్, సీనియర్ నాయకులు రంగారెడ్డి, సాదరి నరసప్ప, మూర్తి, నారాయణ, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

శత్రువులు.. ఒక్కటయ్యారు..

చిలమత్తూరుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు నాగరాజు యాదవ్, టీడీపీలోని మాజీ సర్పంచ్ అశ్వర్థప్ప, మాజీ కన్వీనర్ నందీషప్ప మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో 20 ఏళ్లుగా రాజకీయ శత్రుత్వం ఉండేది. అలాంటి వారు ఏకమయ్యారు. సోదరుడు లక్ష్మీనారాయణ యాదవ్‌తో కలిసి నాగరాజు యాదవ్ టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్షంలో శుక్రవారం పసుపు కండువా కప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో అశ్వత్థప్ప, నందీషప్ప ఇళ్లకు నాగరాజు వెళ్లారు. బాలయ్య గెలుపునకు సమష్టిగా పనిచేద్దామని కోరారు. దీంతో వారు ఏకీభవించి, కోఆర్డినేటర్ శ్రీనివాసరావుతో కలిసి నాగరాజు యాదవ్ ఇంటికి భోజనానికి వెళ్లారు. దీంతో 20 ఏళ్లుగా ఉన్న శత్రుత్వం సమసిపోయింది. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ హిందూపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాలకృష్ణ విజయానికి సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.



నాగరాజుయాదవ్ ఇంట్లో సమావేశమైన టీడీపీ నాయకులు

-చిలమత్తూరు

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఏప్రిల్ 18: పట్టణంలోని ఒకటో వార్డులో నివాసముంటున్న తిరుపాల్ నాయక్ భార్య నందినీబాయి కుటుంబ కలహాలతో గురువారం విషద్రావకం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఆమెను కుటుంబసభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యంకోసం 108లో హిందూపురం తరలించినట్లు తెలిపారు.

23 నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 18: ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం తెలిపారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాదాపు 22వేల మంది పరీక్ష ఫీజు చెల్లించారని, వారి హాల్ టికెట్స్ జ్ఞానభూమి పోర్టల్ ద్వారా కళాశాలల ప్రిన్సిపాల్స్ లాగిన్‌కు పంపామని తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్స్‌గా ఆయా కేంద్రాల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారని తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించండి

సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు అనీల్‌కుమార్ ఖండే వాల్

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 18: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని రైల్వే అధికారులకు సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు, మౌలిక సదుపాయాల పరిశీలకుడు అనీల్‌కుమార్ ఖండేవాల్ పేర్కొన్నారు. అమృత్ భారత్ కింద రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల పరిశీలనలో భాగంగా ఆయన గురువారం హిందూపురానికి వచ్చారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు పరిశీలించారు. టాయిలెట్లు తదితర సదుపాయాలపై సూచించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కొల్లకుంట అంజినప్ప, పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్ కుమార్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు లాయర్ శివశంకర్, నాయకులు దాదు, చైతన్య గంగిరెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లు హిందూపురంలో నిలపాలని కోరారు. చర్చించి చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు. అనంతరం స్టేషన్‌లో రైల్వే సిగ్నల్, ప్యానల్ బోర్డు, ఆధునీకరణ పనుల ఇంజనీర్ విభాగం సిబ్బందితో మాట్లాడారు. సిబ్బందికి అన్ని సదుపాయాలు కల్పించాలని డీఆర్ఎం యోగేష్ మోహన్‌కు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం క్రిష్ణచైతన్య, సీనియర్ డీఓఎం క్రిష్టారెడ్డి అన్ని శాఖల విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగు పడింది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, ఏప్రిల్ 18: పట్టణంలో ఆరోగ్య కేంద్ర భవనాలపై ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ పేరును రంగులు వేసి అధికారులు గురువారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 16న కోడ్ పట్టించుకోరా అనే శీర్షికతో కథనానికి ప్రచురితం కావడంతో సంబంధిత ఎన్నికల అధికారులు ఆ శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చారు. వారు వెంటనే అక్కడికి వెళ్లి భవనంపై ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ పేరుపై రంగులు వేసి మూసివేశారు.

ఎన్‌డీఏ కూటమికి ఎంఎస్‌పీ మద్దతు

ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్

పెనుకొండ, ఏప్రిల్ 18 : దళితులు అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే అది ఎన్‌డీఏ ద్వారానే సాధ్యమని, అందుకే ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డీఏకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. పెనుకొండకు గురువారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేదన్నారు. అందుకే ఎన్‌డీఏ కూటమికి మద్దతు పలుకుతున్నామనారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఎన్‌డీఏ కూటమి ధర్మవరం నియోజకవర్గం అభ్యర్థి సత్యకుమార్ యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించడానికి మందకృష్ణ మాదిగ వస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

వైభవంగా ఉచిత సామూహిక వివాహాలు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

మడకశిర రూరల్, ఏప్రిల్ 18: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని నీలకంఠాపురం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉచిత సామూహిక వివాహాలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వివాహాలు జరిగాయి. ఆలయంలో ఉదయం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అదే సమయంలో 10 జంటలు ఒక్కటయ్యాయి. కర్ణాటక పట్టనాయకనహళ్ళి నంజావధూతస్వామి చేతులమీదుగా తాళిబొట్లు, కాలిమెట్టెలు అందించి ఆశీర్వదించారు. ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల, నూతన వధూవరులను ఆశీర్వదించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అడవి పందిని తప్పించబోయి గ్రామ పంచాయతీ సభ్యుడి మృతి

పావగడ, ఏప్రిల్ 18: తాలూకా పరిధిలోని బెళ్లిబెట్లు గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ సభ్యుడు కృష్ణప్ప(46) అడివి పందిని తప్పించబోయి జరిగిన బైకు ప్రమాదంలో మృతి చెందాడు. సంవత్సరం కిందట జరిగిన గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో గెలిచిన కృష్ణప్ప భార్యతో కలిసి బుధవారం తన బంధువుల ఊరైన అచ్చంపల్లికి దిచక్రవాహనంలో వెళ్లాడు. రాత్రి సమయంలో తిరిగి తన స్వగ్రామానికి వస్తుండగా శైలాపురం, కోటగుడ్డం మధ్యలోని మద్రేనహళ్లి ఫారెస్టులో అడవి పందుల గుంపు ఆకస్మికంగా రోడ్డుకు అడ్డుగా వచ్చింది. వాటిని తప్పించబోగా ద్విచక్రవాహనం అదుపుతప్పి వారిద్దరూ కిందపడ్డారు. వెంటనే భార్య గ్రామస్థుల సహకారంతో 108లో ఆయనను పావగడ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడు. ఈఘటనపై వైఎన్‌హొసకోట పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ మాళప్ప తెలిపారు.